సాక్షి ఏలూరు

బుధవారం । 8 । నవంబర్ । 2023



శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంఘం ఆధ్వర్యంలో ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు వినతిపత్రం అందజేశారు. IIలో



అపూర్వం.. అనివేటి మండపం

ప్రకృతి అందాల నడుమ కొల్లేటి పెద్దింట్లమ్మ ఆలయం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం అదనపు ఆకర్షణ కానుంది. IIలో ▸



రవాణా సిబ్బందిపై దురుసు ప్రవర్తన

విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారులపై జనసేన నేత కునుకు రామకృష్ణ దురుసుగా ప్రవర్తించారు. దీనిపై పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. IIలో ▸

న్యూస్‌రీల్

భారీ వర్షానికి రోడ్లు జలమయం



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

భీమడోలు: మండలలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, బాటసారులు అవస్థలు పడ్డారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటుకు వెళ్లే రహదారి, రాజులవీధిలోని రోడ్లలో ఉన్న భారీ గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రహదారులకు ఇరువైపులా ఉన్న డ్రైయిన్లను ఆక్రమించుకోవడం వల్ల వర్షపు నీరు కిందకు పారక రోడ్లపై నిలిచిపోయింది.

9న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

ఏలూరు(మెట్రో): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషనరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పేటీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 20 ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ పాసై, 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారై ఉండాలన్నారు. వేరియంట్ ప్రైమరీ స్కూల్‌లో 10 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని, వీటికి బీఈడీ, డీఈడీ, డిగ్రీ, పీజీ చేసిన 40 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఎల్ఐసీ ఆఫ్ ఇండియాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలు 150 ఉన్నాయని, ఎస్ఎస్‌సీ పాసై, 18 సంవత్సరాల పైబడిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 88868 82032 నెంబరులో సంప్రదించాలన్నారు.

17న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు(మెట్రో): పశ్చిమగోదావరి జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తారని జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19 నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారయణ మూర్తి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 19, 26, వచ్చే నెల 3, 10 తేదీల్లో భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు రాత్రి 9 గంటలకు బయలుదేరుతాయని, భీమవరం డిపో నుంచి 30 బస్సు సర్వీసులు అందిస్తున్నామని అన్నారు. టికెట్ ధరలు పల్లె వెలుగు రూ.700, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్ రూ.1,000, సూపర్ లగ్జరీ రూ.1,100గా నిర్ణయించామని అన్నారు. ఇతర విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామని, ఈ పంచారామలకు ఒక గ్రామం నుంచి 40 మంది ఉంటే బస్సు ఆ గ్రామం నుంచే బయలుదేరుతుందని తెలిపారు. శబరిమలైకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, స్వాములకు కావాల్సిన విధంగా బస్సులను సిద్ధం చేస్తామన్నారు. ఇప్పటికే రెండు ప్యాకేజీలు సిద్ధంగా ఉన్నాయని వాటిలో ఒకటి 6 రోజులు, మరొకటి 8 రోజుల యాత్రా ప్యాకేజీలని చెప్పారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సబ్సిడీ

ఏలూరు(మెట్రో): ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం కింద రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 10 లక్షల వరకు రాయితీ ఇస్తారని కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం నాబార్డ్ నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు, వాటి అభివృద్ధికి సంబంధించి సమావేశం నిర్వహించారు. మామిడి, నిమ్మ, కోకో ఆరబెట్టేందుకు అవసరమైన సోలార్ డ్రయర్‌కు సబ్సిడీ అందజేస్తారని చెప్పారు.

సర్పంచుల గౌరవ వేతనం విడుదల

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎన్నికలు జరిగిన 393 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2023–24 ఏడాదికి సర్పంచులకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం విడుదల చేశారని జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లికార్జునరావు తెలిపారు. 9 నెలలకు రూ.3 వేల చొప్పున ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.27 వేలు విడుదల చేశారన్నారు.

ఆచరణలో సాధికారత

- బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట
- ఉమ్మడి పశ్చిమలో మంత్రులు మొదలుకొని నామినేటెడ్ పదవుల వరకు
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే..
- నేడు పాలకొల్లులో సామాజిక సాధికార బస్సు యాత్ర



పాలకొల్లు గాంధీబొమ్మల సెంటరులో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గ్రామ స్థాయి నుంచి మంత్రి పదవుల వరకు బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఇతర రాజకీయ పార్టీల్లా ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓటు బ్యాంకును వాడుకుని వారిని విస్మరించకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక, రాజకీయ సాధికారత కల్పించారు. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌ను... బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా మార్చి చూపారు. నామినేటెడ్ పదవుల్లోనూ జిల్లా, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవుల్లోనూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చి అట్టడుగు వర్గాలకు అగ్రాసనం వేసి రాజకీయంగా బలమైన పునాదులు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెప్పే విధంగా నా ఎస్సీ.. నా ఎస్టీ... నా బీసీ సోదరులు అనే మాటను పూర్తి ఆచరణలో చూపి రాజకీయంగా ఎదుగుదలకు పూర్తిగా సహకరించారు. ఈ పరిణామాల క్రమంలో గడిచిన నాలుగేళ్ళ 7 నెలల పరిపాలనలో ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా బుధవారం పాలకొల్లులో సామాజిక సాధికారత బస్సు యాత్రను నిర్వహించనున్నారు.

మంత్రి పదవులు, ఎమ్మెల్సీ పదవుల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో కేటాయింపులు మొదలుకొని మంత్రి పదవుల వరకు అన్నింట్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పాదయాత్రలో ఇచ్చిన హామీకి మించి పదవులు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి పౌరసరఫరాల శాఖా మంత్రిగా కారుమూరి నాగేశ్వరరావు, హోం మంత్రిగా తానేటి వనితలు కేబినెట్‌లో కొనసాగుతున్నారు. దళిత వర్గాలకు చెందిన కొయ్యే మోషేన్‌రాజు శాసనమండలి చైర్మన్‌గా ఉన్నారు. జిల్లాలో శాసనమండలి సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మూడు స్థానాలకు గాను రెండు స్థానాలు బలహీన వర్గాలకు చెందిన నేతలనే ఎన్నిక చేశారు. బీసీ వర్గానికి చెందిన కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకట రమణకు సభ్యులుగా అవకాశం కల్పించారు.

నామినేటెడ్ పదవుల్లోనూ..

రాష్ట్ర స్థాయిలో కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్‌గా బర్రి లీల, ఎంఆఈసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పెంద్ర వీరన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా గుబ్బల తమ్మయ్య, డీసీఎంఎస్ చైర్మన్‌గా వేంద్ర వెంకటస్వామి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్‌గా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు వైస్ చైర్మన్‌గా దయాల నవీన్‌బాబు, సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా శెట్టి అనంతలక్ష్మి, అతిరస కార్పొరేషన్ చైర్మన్‌గా ఇళ్ళ భాస్కరరావు, వడ్డీల కార్పొరేషన్ చైర్మన్‌గా సైదు గాయత్రీ సంతోష్, ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలిగా గంజిమాల దేవిలకు రాష్ట్ర స్థాయి పదవుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో సుమారు 300 మందికిపైగా వివిధ కార్పొరేషన్లు, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవుల ద్వారా ప్రాతినిధ్యం లభించింది.

నేడు పాలకొల్లులో సభ

53 నెలల ప్రభుత్వ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేసిన మేలును వివరించడమే ప్రధాన ఎజెండాగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రలు నిర్వహిస్తుంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పాలకొల్లులో సాధికార బస్సు యాత్ర జరగనుంది. జిల్లాలో ఇప్పటికే నర్సాపురంలో, దెందులూరులో నిర్వహించిన బస్సు యాత్రలు సూపర్‌సక్సెస్ కావడంతో పార్టీ కేడర్‌లో జోష్ నెలకొంది. ఈ క్రమంలో పాలకొల్లు సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజకవర్గ సమన్వయకర్త గూడాల గోపి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, విడదల రజని, చెల్లుబోయిన వేణుగోపాల్, కారుమూరి నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు నందిగం సురేష్, మార్గాని భరత్, మండలి స్పీకర్ కొయ్యే మోషేన్‌రాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

మద్దిలో కార్తీక ఉత్సవాలకు ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఈనెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీక మాస మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. మంగళవారం గురవాయిగూడెం మద్ది క్షేత్రంలో ఈఓ మాట్లాడుతూ కార్తీక మాసం నెలరోజుల పాటు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టు కుని ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ల ఏర్పాట్లతో పాటు, ప్రతి భక్తుడికి స్వామి ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్తీక సోమవారాల్లో ఉదయం 8 గంటల నుంచి లక్ష తమలపాకులతో లక్షార్చనలు, ప్రతీ బుధవారం పలు రకాల పుష్పాలతో లక్షార్చనలు జరుగుతాయన్నారు. ఆదివారాల్లో సువర్చలా సహిత హనుమద్ కల్యాణాలు జరుగుతాయన్నారు. ఈ నెల 16 నుంచి 23 వరకు 30వ సంవత్సర సప్తాహ మహోత్సవాలు జరుగుతాయన్నారు. మహోత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హోమాలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సప్తాహ మహోత్సవాల్లో భాగంగా 22 న ఉపాలయంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. డిసెంబర్ 10న పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం జరుగుతుందన్నారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. రూ.1,35,217 ఆదాయం వచ్చినట్లు, 1,000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



రైతు భరోసా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

పెదవేగి: వైఎస్సార్ రైతు భరోసా పథకంలో అర్హులైన రైతులకు ఆర్థిక సాయం పంపిణీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా పుట్టపర్తిలో ప్రారంభించగా.. పెదవేగి మండలం వేగివాడలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద 2,04,327 మంది రైతులకు రూ.84.58 కోటుల్ లబ్ది చేకూరిందని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతు రైతులు ఆనందంగా, క్షేమంగా ఉంటూ ప్రతి ఒక్కరికే అన్నం పెట్టాలన్నదే ముఖ్యమంత్రి కోరిక అన్నారు. ముఖ్యమంత్రి జిల్లా రైతు సోదరులకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని, వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు మొత్తంగా రూ.1187.12 కోట్లు రైతుల ఖాతాలలో జమచేశారన్నారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి రెండవ దఫాగా ఏలూరు జిల్లాలో భూయజమానులకు రూ.78.13 కోట్లు, మన్యం భూములకు రూ.0.58 కోట్లు, కౌలు రైతులు 12628 రూ.5.85 కోట్లు, ఎండోమెంట్ రైతులకు రూ.0.02 కోట్లు అందజేశామన్నారు. జిల్లాలో మొత్తంగా 2,04,327 మంది రైతులకు రూ 84.58 కోట్ల నగదును ఖాతాలలో జమచేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ సలహా మండలి చైర్మన్ వెజ్జు వేంకటేశ్వర రావు, జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, పెద్ద ఎత్తున రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు ఏర్పాట్లు

నేడు పాలకొల్లులో సామాజిక సాధికార యాత్ర



పాలకొల్లు రామచంద్ర గార్డెన్స్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), జేసీఎస్ చైర్మన్ పుత్తా ప్రతాప్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన ప్రయోజనాలను వివరించేందుకు తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. స్థానిక రామచంద్ర గార్డెన్స్‌లో పార్టీ ముఖ్య నాయకులతో బస్సు యాత్ర ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. 8వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గాంధీబొమ్మల సెంటర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు విడదల రజని, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, విప్ గ్రంధి శ్రీనివాస్ పాల్గొంటున్నట్లు గుడాల గోపి చెప్పారు. బస్సు యాత్రకు ఇప్పటికే కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం చేశామన్నారు. సభా స్థలికి కనీసం 25వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి, పాలకొల్లు మండలం, యలమంచిలి, పోడూరు మండలంలోని 8 గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు తరలి వచ్చేలా బస్సులు, ఆటోలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, రాష్ట్ర జేసీఎస్ చైర్మన్ పుత్తా ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ చైర్మన్ ఘంటా ప్రసాద్, రాష్ట్ర బూత్ కన్వీనర్ టీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, మంతెన యోగేంద్ర బాబు, తెన్నేటి కిషోర్, ముచర్ల శ్రీరామ్, అడబాల వెంకటరమణ, గొర్రెల శ్రీనివాస్, మానుకొండ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ఏర్పాట్లపై సమీక్ష



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మాణాలు, బిల్లులు చెల్లింపు అంశాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): తాడువాయి ఆర్ అండ్ ఆర్ కాలనీలో అంగన్‌వాడీ, స్కూలు, వీడబ్ల్యూఎస్ తదితర ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పోలవరం ఆర్ అండ్‌ఆర్‌కు సంబంధించి వివిధ అంశాలపై పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. పోలవరం ప్రాజెక్ట్ సహాయ పునరావాసం(ఆర్‌అండ్‌ఆర్) కింద నిర్వాసితులకు పెండింగ్ బిల్లుల అప్ లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆప్షన్–2, 3 కింద ఉన్న బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 45.16 కాంటూరుకు సంబంధించి 15 గ్రామాలకు మిగిలిన 2 గ్రామాల్లో ఎన్యుమరేషన్‌ను శుక్రవారం నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ఇటీవల గ్రామసభల్లో భూమి, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి అందిన సమస్యలను కేసుల వారీగా నివేదిక అందించాలని ఐటీడీఏ పీఓను ఆదేశించారు. 948 మంది నిర్వాసితులకు పాస్ కార్డుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శుక్రవారం నాటికి దరఖాస్తు చేసే ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తాడువాయి రైతుల భూమి పరిహారం, కోర్టు కేసులకు సంబంధించి తదితర అంశాలపై కలెక్టర్ సంప్రదింపులు చేశారు.

కంటి శుక్లాల ఆపరేషన్లకు ఏర్పాట్లు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో గుర్తించిన కంటి వెలుగుకు సంబంధించిన ఆపరేషన్ల నిర్వహణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కంటిశుక్లాల ఆపరేషన్ల నిర్వహణపై వైద్యాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కంటి వైద్యులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో గుర్తించిన 2,746 మందికి కంటిశుక్లాల ఆపరేషన్ సకాలంలో నిర్వహించడానికి డీఎంహెచ్‌ఓ, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త సమన్వయం చేసుకుని ఆపరేషన్లు ఇచ్చిన వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఎస్.షర్మిష్ఠ, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డా.రాజీవ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా.పాల్ సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగం ప్రధాన అధిపతి డా.మల్లిఖార్జునరావు, పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు

చీఫ్ విప్ ముదునూరి



మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో ఆర్డీవో అంబరీష్

నరసాపురం: కార్తీక మాసం దృష్ట్యా పేరుపాలెం బీచ్‌లో యాత్రికుల రద్దీకి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పేరుపాలెం బీచ్‌లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఆర్డీవో ఎం.అత్యుత్ అంబరీష్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముదునూరి మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతునన్న నేపథ్యంలో బీచ్‌లో ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సముద్రంలో లోతుకు దిగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇటీవల సముద్రంలో పలువురు గల్లంతైన ఘటనల దృష్ట్యా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి యువకులు బీచ్ వద్దకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే స్నానాలకు అనుమతి ఇవ్వాలని చెప్పారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. నరసాపురం ఆర్డీవో అత్యుత్ అంబరీష్ మాట్లాడుతూ బీచ్ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. బీచ్‌లో పారిశుధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మద్యం అందుబాటులో లేకుండా చర్యలు చేపట్టాలని, చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేయాలన్నారు. శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, అనితకుమారి, జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ కార్మికులకు వేతనాలు ఖరారు

ఏలూరు (టూటౌన్): ఎన్ఎంఆర్ కార్మికులకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి వేతనాలు ఖరారు చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మూడు కేటగిరీల్లో ఖరారు చేశారని ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్–స్కిల్డ్ వారికి ఈ వేతనాలు నిర్ణయించినట్లు తెలిపారు. స్కిల్డ్ కార్మికుడికి రోజుకు రూ.630 నుంచి రూ.675, సెమీ స్కిల్డ్ కార్మికుడికి రూ. 565 నుంచి రూ.605, అన్–స్కిల్డ్ కార్మికుడికి రూ.525 నుంచి రూ.562గా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. పెరిగిన వేతనాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నట్లుగా ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యా సంస్థల బస్సుల తనిఖీ



ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న ఉపరవాణా కమిషనర్ శాంతకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో మంగళవారం సాయంత్రం ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి స్వయంగా తనిఖీ చేశారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఆయా విద్యా సంస్థల బస్సులను ఆపి నిబంధనల ప్రకారం తిప్పుతున్నారా? లేదా? అని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న శ్రీచైతన్య, నారాయణ, సిద్ధార్థ, ఆక్స్‌ఫర్డ్ తదితర విద్యా సంస్థలకు చెందిన 17 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న ఇద్దరు డ్రైవర్లపై, పరిమితికి మించి విద్యార్థులను రవాణా చేస్తున్న బస్సులపై నాలుగు కేసులు, అత్యవసర ద్వారాలు లేని ఆరు బస్సులపై, ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేని 5 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి మాట్లాడుతూ విద్యా సంస్థల బస్సులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న బస్సులపై జరిమానా విధించామని తెలిపారు. జరిమానా విధించిన బస్సుల యాజమాన్యాల్లో కొందరు రూ. 24 వేలు చెల్లించారని, మరో రూ. 34 వేల వరకూ చెల్లించాల్సి ఉందన్నారు. జంగారెడ్డిగూడెంలో సైతం తనిఖీలు నిర్వహించారని తెలిపారు.

లాడ్జిలో వ్యక్తి బలవన్మరణం

హనుమాన్ జంక్షన్ రూరల్ (గన్నవరం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం ముండూరుకు చెందిన అట్లూరి గోపాలకృష్ణ (53) రెండు నెలలుగా శ్రీనివాస లాడ్జిలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గోపాలకృష్ణ మంగళవారం లాడ్జి గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజులుగా గది తలుపులు తెరవకపోవటంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి లాడ్జి గది తలుపులు తొలగించి లోనికి వెళ్లి చూడగా గోపాలకృష్ణ విగతజీవిగా పడి ఉన్నాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. అప్పుల బాధలు భరించలేక రెండు నెలలుగా లాడ్జిలో ఉంటూ తల దాచుకుంటున్నాడని, ఆ ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గోపాలకృష్ణ మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అపూర్వం.. అనివేటి మండపం

- దాతల సాయం రూ.4.50 కోట్లతో నిర్మాణం
- కొలువుతీరుతున్న దేవతామూర్తుల శిల్పాలు
- కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి కొత్త కళ


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం


పెద్దింట్లమ్మ తల్లి


విగ్రహాలను చెక్కుతున్న శిల్పి


నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ (ఫైల్)

కైకలూరు: చుట్టూ నీరు, పక్షుల కిలకిలరావాలు.. ప్రకృతి అందాల నడుమ కొల్లేటి పెద్దింట్లమ్మ ఆలయం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. కొల్లేరు సరస్సు తీరాన 11వ శతాబ్ద కాలంలో వేంగి–చాళుక్య రాజులు నిర్మించిన ఈ దేవాలయానికి ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం అదనపు ఆకర్షణ కానుంది. ఆ కాలంలో 150 రాజ హస్తాల వెడల్పు, 7 నిలువుల లోతు, 3 కోశాల చుట్టు కొలతతో కొల్లేటికోట ఉందని చైనా యాత్రికుడు హ్యుయన్త్సాంగ్ తన పుస్తకంలో రాయడం విశేషం. దేవాలయం వద్ద బయల్పడిన శిలాఫలకాలలో అప్పటి చరిత్ర లిఖించబడి ఉంది. ఏటా పెద్దింట్లమ్మకు జాతర (తీర్థం) జరుగుతోంది. తెలంగాణ బోనాల సంప్రదాయం మాదిరిగా అమ్మవారికి కలువబోనాలు సంప్రదాయం 2020 నుంచి పాటిస్తున్నారు.

80 శాతం పనులు పూర్తి

కొల్లేటికోట అనివేటి మండప నిర్మాణానికి రూ.4.50 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కొల్లేరు పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, అమ్మవారి భక్తులు విరివిగా విరాళాలు అందించారు. 2022 మే 5న అనివేటి మండప నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శంకుస్థాపన చేశారు. 105 అడుగుల వెడల్పు, 305 అడుగుల పొడవుతో నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 80 శాతం పనులను పూర్తి చేశారు. దాతల విరాళాలను నిర్మాణ సామగ్రి రూపంలో కొనుగోలు చేసి పారదర్శకంగా పనులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఆదేశాలతో కుమారుడు దూలం ఫణి శ్యామ్‌కుమార్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

అపురూపం.. శిల్పకళా నైపుణ్యం

అనివేటి మండపంలో ఒక పక్క 18, ఎదురుగా మరో 18 వెరసి 36 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడకు చెందిన ప్రముఖ శిల్పి సూరిబాబు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఒక పక్క అష్టాదశ శక్తి పీఠాలకు చెందిన శాంకరి (శ్రీలంక), కామాక్షి (తమిళనాడు), శృంఖల (పశ్చిమబెంగాల్), చాముండి(కర్ణాటక), జోగులాంబ (తెలంగాణ), భ్రమరాంబిక (ఆంధ్రప్రదేశ్), మహాలక్ష్మి(మహారాష్ట్ర), ఏకవీరిక (మహారాష్ట్ర), మహాకాళి (మధ్యప్రదేశ్), పురుహూతిక(ఆంధ్రప్రదేశ్), గిరిజా (ఒడిషా), మాణిక్యాంబ (ఆంధ్రప్రదేశ్), కామరూప (అసోం), మాధవేశ్వరీ (ఉత్తరప్రదేశ్), వైష్ణవి (హిమాచలప్రదేశ్), మంగళ గౌరీ (బీహార్), విశాలక్ష్మి(ఉత్తరప్రదేశ్), సరస్వతీ (జమ్ము కాశ్మీర్) రూపాలతో పాటు ఎదురుగా నవదుర్గలు శైలపుత్రి, బ్రహ్మచారిణీ, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిరాత్రి ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కాకుండా సమీప జిల్లాల్లో పేరు గడించిన ప్రముఖ అమ్మవార్ల విగ్రహాలను నిర్మిస్తున్నారు.

వారధి నిర్మాణంతో పెరుగుతున్న భక్తులు

కొల్లేరు ప్రజల చిరకాల వాంఛ అయినా సర్కారు కాల్వపై వారధి నిర్మాణం పూర్తయ్యింది. తెలుగుదేశం పాలనలో ఆలస్యం అవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో నిర్మాణం పూర్తి చేశారు. దీంతో అమ్మవారి దేవస్థానికి విచ్చేసే భక్తుల సంఖ్య పెరుగుతోంది. అనివేటి మండపం పూర్తయితే సమీప జిల్లాల్లోనే అతిపెద్ద మండపంగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం పేరుగడించనుంది.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద నిర్మిస్తోన్నా అనివేటి మండపం కొల్లేరు గ్రామాలకే మణిహారంగా మారుతోంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సహకారంతో అన్ని పనులు జరుగుతోన్నాయి. అన్ని తనై ఎమ్మెల్యే కృషి చేస్తోన్నారు. దాతలందరికీ ధన్యవాదాలు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శిల్పకళానైపుణ్యంతో దేవతామూర్తుల ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. నూతన ఏడాదిలో ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నాం.

– కందుల వేణుగోపాలరావు, ఈవో, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

• గడపగడపకు సంక్షేమం


పెదవేగి: వేగివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధుడి సమస్యను అడిగి తెలుసుకుంటున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుమూ లేకుండా ప్రవేశాలు పొందడానికి మరో అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీ వరకు గడువు ఇవ్వగా ప్రస్తుతం ఆ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంబంధిత అధీకృత స్టడీ సెంటర్ల ద్వారా, ఏపీఓఎస్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20 బస్తాల కంటే ఎక్కువ అమ్మితే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే యూరియాను అక్రమంగా అమ్మితే చర్యలు తప్పవని జేసీ బి.లావణ్యవేణి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టాప్–20 యూరియా కొనుగోలుదారులు, డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో జిల్లా స్థాయి టాప్–20 యూరియా విచారణ సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. ఒకే వ్యక్తికి 40 బస్తాలకు మించి యూరియా విక్రయించిన జిల్లాలో 54 మంది ఎరువుల దుకాణదారులను గుర్తించామని, వీరికి జరిమానా గానీ, డీలరు లైసెన్స్‌ను రద్దుచేస్తామన్నారు. ఎట్టి పరిస్థితిలోను ఒక్కరికే యూరియా 20 బస్తాలకు మించి విక్రయించరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను డీలర్లు తప్పకుండా పాటించాలని, లేకపోతే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ, ఏడీఏలు, ఏవోలు, ఆర్‌బీకే అసిస్టెంట్లు, డీలర్లు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

14 నుంచి సున్నిత పర్యావరణంపై గ్రామ సభలు

ఏలూరు (మెట్రో): కొల్లేరు అభయారణ్యం చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంత ఏర్పాట్లపై ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ప్రజా అవగాహన కార్యక్రమాలు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఏలూరు వన్యప్రాణి యాజమాన్య విభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎస్.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లేరు కాంటూరు పరిధిలోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభయారణ్యం పరిధిలోని ఏలూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు, కైకలూరు, మండవల్లి, ఆకివీడు మండలాల్లో వివిధ దైనందిన కార్యక్రమాలు నిర్వహించే ప్రజలకు సంబంధిత మండల తహసీల్దార్ వారి కార్యాలయంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ హాజరై ఈ అవగాహన సదస్సును వినియోగించుకోవాలని ఎస్. రవిశంకర్ తెలియజేశారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి దుర్మరణం


సత్యంనాయుడు (మృతదేహం)

ఏలూరు టౌన్: ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి చెందిన వంగపండు సత్యం నాయుడు (67) బొబ్బిలి నుంచి ఏలూరుకు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఏలూరు రైల్వేస్టేషన్‌లో రైలు ఆగి, తిరిగి బయలుదేరుతున్న సమయంలో సత్యంనాయుడు నిద్రమత్తులో రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో జారి పడిపోయాడు. తోటి ప్రయాణికులు గమనించి అతని బయటికి తీసే సమయంలోనే రైలు కదలడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం రాత్రి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఏలూరులో వాయిద్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎంపీ, ఎమ్మెల్యేలకు నాయీబ్రాహ్మణ సంఘ నాయకుల వినతి


ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు ఏలూరులో ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యలమందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.కోటి పైన ఆదాయం ఉన్న దేవాలయాలు 70, రూ.25 లక్షల ఆదాయం ఉన్నవి సుమారుగా 1378, మొత్తం 1,448 ఈవో కేటగిరి దేవాలయాల్లో డోలు, నాదస్వరం, శృతి, తాళం పోస్టులు సుమారు 2,500 ఖాళీగా ఉన్నాయన్నారు. ముఖ్యమైన దేవాలయాల్లో ఈ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రార్థన దేవదాయ చట్టంలో అర్చకులకు, భజంత్రీలు పెన్షన్ కింద పొందుపర్చబడిందన్నారు. అర్చకులకు వంశ పారంపర్య హక్కు కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వీరితో పాటుగా భజంత్రీలకు కూడా ఈ జీవోను వర్తింపచేయాలని కోరారు. 45 ఏళ్ల దాటిన వాయిద్య కళాకారులకు పెన్షన్ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ తన పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీ మేరకు కళాకారులకు నంది, హంస, ఉత్తమ సేవ వంటి అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఉమ్మడి 13 జిల్లాల్లో దాదాపు రెండు లక్షల వాయిద్య కళాకారులకు వేతన స్కేలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందనాడ నందేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు చెడే వెంకన్న, జిల్లా కార్యదర్శి కింజంగి రాజు, నగర అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు నావుగోపు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు పెద్ద ఎత్తున మేళతాళాలతో ఊరేగింపుతో ఎంపీ, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు తరలివెళ్లారు.

రవాణా శాఖ సిబ్బందిపై దురుసు ప్రవర్తన


మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారులపై దురుసుగా ప్రవర్తించిన జనసేన నేత కునుకు రామకృష్ణపై మంగళవారం పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరవాసరంలో వాహనాల తనిఖీ కోసం వెళుతూ పాలకోడేరు మండలం పెన్నాడ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఒక వాహనాన్ని తనిఖీ చేయాల్సిందిగా ఎంవీఐలు రవి, లక్ష్మి తమ వద్ద ఉన్న హోంగార్డును ఆదేశించగా, హోంగార్డు తనిఖీ చేస్తున్న సమయంలో రామకృష్ణ దురుసుగా ప్రవర్తించడంతో భయాందోళనకు గురైన అధికారులు పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన వీరవాసరంలో వాహనాల తనిఖీల కోసం వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ రవి, లక్ష్మి వెళుతున్నారు. పాలకోడేరు మండలం పెన్నాడ వద్ద ఒక వాహనాన్ని నిలుపుదల చేసే క్రమంలో ఆ వాహనదారుడు ఆ వెహికల్‌ను అక్కడ ఉన్న షాపుల మధ్యకు తీసుకువెళ్లి నిలిపాడు. అధికారుల ఆదేశంతో హోంగార్డు వెళ్లి వాహనాన్ని తనిఖీ చేసి తిరిగి వస్తుండగా అక్కడే ఉన్న జనసేన పార్టీ నేత కునుకు రామకృష్ణ ఆవేశంగా వీడియోలు తీస్తూ ఇన్‌స్పెక్టర్లపైకి దూసుకువచ్చి అక్కడ ఉన్న కొందరు దగ్గర్నుంచి రూ. 3 వేలు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేయిస్తూ గతంలో తన వాహనానికి వేసిన జరిమానాపై ఆగ్రహం వ్యక్తం చేశాడన్నారు. రామకృష్ణ గతంలో కూడా ఒక టోల్‌ప్లాజా వద్ద కారు ఆపినందుకు సిబ్బందిపై వాగ్వివాదానికి దిగి ప్రభుత్వాన్ని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడన్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై రామకృష్ణ దురుసు ప్రవర్తనను ఖండిస్తున్నామన్నారు. ఏఎంవీ రవి మాట్లాడుతూ మద్యం సేవించి ఉన్న జనసేన నాయకుడు కునుకు రామకృష్ణ తీవ్ర ఆవేశంతో వీడియోలు రికార్డు చేస్తూ గతంలో వాహనానికి విధించిన ఫైన్‌పై తనను నిలదీశాడన్నారు. తన మనుషులతో రూ.3 వేలు లంచం తీసుకున్నామని చెప్పించి వీడియోలు రికార్డు చేసి భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. ఏఎంవీఐ లక్ష్మి మాట్లాడుతూ జనసేన నాయకుడు రామకృష్ణ తీరుతో భయాందోళనతో కారులోనే ఉండిపోయానన్నారు. ఎంవీఐలు డీవీ రమణ, కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు నిర్ణయించేవి ప్రయోగాలే



నిట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు, అతిథులు

తాడేపల్లిగూడెం: జీవకణాలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఎస్ఎన్ బోస్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ (కోల్‌కత) శాస్త్రవేత్త డాక్టర్ ఆయాత్తి మల్లిక్ గుప్తా అన్నారు. ఏపీ నిట్‌లో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇన్‌సిలికో మాక్రోమోలక్యులర్ మోడలింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్ అనే అంశంపై సాగుతున్న వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఔషధాల తయారీ విధివిధానాలు, డిజైన్ పద్ధతులు, ఎంత పరిమాణంలో ఉండాలో గుప్తా వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న 60 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సుదర్శన్‌దీప అధ్యక్షత వహించారు. డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలి

తాడేపల్లిగూడెం: మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి అన్నారు. మంగళవారం ఉద్యాన కళాశాలలో చాక్లెట్ తయారీ, మార్కెటింగ్ పరపతి గురించి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఐసీఏఆర్ సబ్‌ప్లాన్ కింద ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ పర్యవేక్షణలో శిక్షణ సాగింది. మాధవి మాట్లాడుతూ మహిళలు ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఆదాయం పొందాలన్నారు. చాక్లెట్ తయారీకి అన్ని రకాల సాయాలను అందిస్తామన్నారు. ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.కల్పన , ఆర్‌వీ సుజాత, ఎ.చాందిని, టి.రవికిరణ్ సహాయ సహకారాలను అందించారు. ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీఎం లక్ష్మి, వీహెచ్‌ఏ లోకేశ్వరి, ఉదయ్ నాగరాజు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోల ద్వారా సన్నకారు రైతులకు మేలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎఫ్‌పీఓల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో ఎఫ్‌పీఓల ఏర్పాటు, ప్రోత్సాహం కోసం నిర్వహించిన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో కూరగాయల సాగు, ఉద్యాన పంటల కింద మరిన్ని ఎఫ్‌పీఓలను ప్రోత్సహించాలని సూచించారు. పశుసంవర్ధక, పాల ఉత్పత్తి, ఫిషరీష్ రంగాల్లో కూడా ఎఫ్‌పీవోలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్‌ఎంఈ) కింద పరిశ్రమల ఏర్పాటుకు, నైపుణ్యం పెంచుకోవడానికి, మార్కెటింగ్‌పై ఆసక్తి ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 35 శాతం సబ్సిడీపై 10 లక్షల వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. మామిడి, నిమ్మ, కోకో ఎండబెట్టుటకు అవసరమైన సోలార్ డ్రయ్యర్‌ను సబ్సిడీ ద్వారా అందజేస్తారన్నారు. కూరగాయల రైతు ఉత్పత్తి దారుల సంఘాల ఏర్పాటుకు ఉద్యాన అధికారులను చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌పీఓలకు సేకరణ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, గోడౌన్లు మొదలైన వాటికి 75 శాతం వరకు సబ్సిడీ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. డీడీఎం నాబార్డ్ అనిల్ కాంత్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ద్వారా 10 వేల ఎఫ్‌పీఓల ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో 18 ఏర్పాటయ్యాయన్నారు. ఎల్‌డీఎం నీలాద్రి, డీడీఎం – నాబార్డ్ అనిల్ కాంత్, ఉద్యాన అధికారి, ఎస్ రామ్‌మోహన్ పశుసంవర్ధక శాఖ అధికారి జి.నెహ్రూబాబు, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

డీఐజీని కలిసిన అలీ


ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను సినీ నటుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా) అలీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

– ఫొటోగ్రాఫర్/ఏలూరు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

అడ్మిషన్లు ప్రారంభం

■ Diploma in Anesthesia (DANS) కు అడ్మిషన్స్ ప్రారంభం అర్హత: ఇంటర్మీడియట్ పాస్ (Any Group) అవ్వ పారా మెడికల్ కాలేజ్, (AP ప్రభుత్వంచే గుర్తింపు పొందినది). హుకుంపేట, రాజమండ్రి ✆ : 94402 37253 [R-1151367]

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో ఋణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220945]

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6307]

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-202]

BUSINESS OFFER

■ స్త్రీ/పు॥ చిన్నపెట్టుబడితో మీ ఇంటివద్దే జాబు వర్క్ పద్ధతిలో రెడీమేడ్ మసాలా టీ తయారు చేస్తూ ప్రతీ నెల 50,000/- ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. 7416064527, 7416087357 [H-793427]

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 6309563491 [H-193277]

Wanted

■ గల్ఫ్ దేశంలో మా కుటుంబంలో ఉండి పని చేయుటకు 25 నుండి 35 సంవత్సరములు గల ఏ భాదరబందీ లేని స్త్రీ కావలెను పాస్పోర్ట్ కచ్చితంగా ఉండవలెను ✆ 91 8309768989 [P-772924]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221909]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221866]

■ విజయవాడలో ఇంటి దగ్గరే వుండి పేషెంట్స్‌ని చూసుకొనుటకు మెడికల్ అనుభవం ఉన్న Female కేర్‌టేకర్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం+మంచి జీతం ✆ 98853 99999 [B-486]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [HA-813]

■ Tanmayee ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, పైపుల రోడ్డు, విజయవాడ. RMPలు, ఆడ, మగ వర్కర్లు, వంట మనిషి కావలెను. వయస్సు: 20 నుండి 50 సం॥ Ph: 9652423559/ 7093911010/9573000987 [HA-767]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు. RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 -40000/- ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-828]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు MF వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52828, 6281208656 [B-1206467]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18–28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-193284]

■ క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు, హాస్టల్ ఇన్‌చార్జ్‌లు, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం: 10,000 నుండి 18000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ ఆపైన, వయస్సు: 23+, పని చేయు స్థలం: మాస్టర్ మైండ్స్, గుంటూరు. సంప్రదించండి. ఫోన్ నెంబర్: 8978480383 [G-4794]

■ SERON LABORATORIES Pvt Ltd, Chennai, A well-established Pharmaceutical Company Requires Medical Representatives for the HQ Eluru & Bhimavaram with 1-2 years exp. interested candidates contact: 9600091356, 9840422539. Mail: seronlaboratories@gmail.com [HA-82]





గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.